క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం నాగపంచమి పూజలను విశేషంగా నిర్వహించారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి మూల విరాట్‌కు పెద్ద ఎత్తున క్షీరాభిషేకాలు జరిపారు. విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

చందన సమర్పణకు రూ.లక్ష విరాళం



ఏఈవోకు నగదు అందిస్తున్న దాత ఆళ్ల వెంకట రామకృష్ణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందన సమర్పణకు విశాఖ నగరంలోని ఎండాడకి చెందిన ఆళ్ల వెంకట రామకృష్ణ, రంగమణి దంపతులురూ.లక్ష విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావుకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

అభినందన సత్కారం



పీఏసీఎస్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన చిరికి అవతారంను అభినందిస్తున్న గండి బాబ్జీ


పెందుర్తి: పీఏసీఎస్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చిరికి అవతారంను ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అభినందించారు. టీడీపీ కార్యాలయంలో బాబ్జీని కలిసిన అవతారం తనకు పదవి వచ్చేందుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు అవగడ్డ అప్పలనాయుడు, కునిగంటి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి డీటీ సంతోష్ బదిలీ

- నూతన డీటీగా కిషోర్ నియామకం

పెందుర్తి: పెందుర్తి రెవెన్యూలో బదిలీల పరంపర కొనసాగుతోంది. ఇన్‌చార్జి తహసీల్దార్(అడహక్)గా విధులు నిర్వహిస్తున్న హెచ్‌డీటీ ఎ.సంతోష్‌కిరణ్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎస్‌హెచ్‌-16 భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్‌గా విధుల్లో ఉన్న జి.కిషోర్‌ను నియమిస్తూ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెందుర్తి తహసీల్దార్(అడహక్)గా నియమితులైన ఐ.వెంకటఅప్పారావు ఇంకా బాధ్యతలు తీసుకోలేదు. ఈ నెల 21న వెంకటఅప్పారావును తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దాదాపు పది రోజులు గడుస్తున్నా వెంకటఅప్పారావు బాధ్యతలు తీసుకోకపోవడం వెనుక పెందుర్తిలోని కూటమి నాయకుల పాత్ర ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తానికి టీడీపీ, జనసేన మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరులో మరోసారి రెవెన్యూలో ఉన్నతాధికారుల బదిలీ వ్యవహారం చర్చనీయాంశమైంది. ఇటీవల పెందుర్తి మండలం చింతగట్ల రెవెన్యూలో నెలకొన్న వివాదాస్పద పరిణామాల నేపథ్యంలో అక్కడి వీఆర్వోను కూడా బదిలీ చేయడం గమనార్హం.

'ఆదర్శ్' విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్



మెడ్‌టెక్ జోన్ వద్ద ఆదర్శ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

పెందుర్తి: ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పరవాడ సమీపంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌ను మంగళవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న కార్యకలాపాల గురించి ఏఎంటీజెడ్ కోఆర్డినేటర్ బాల త్రిపుర సుందరి విద్యార్థులకు వివరించారు. ఇలాంటి ఇండస్ట్రియల్ విజిట్ల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు మరింతగా మెరుగవుతాయన్నారు. కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఫ్లోరా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉప్పుటేరు.. రైతులు బేజారు

- ఇసుక మేటలతో భారీగా నిలిచిన పరిశ్రమల వ్యర్థ జలాలు
- పంట పొలాల్లోకి చేరడంతో నష్టపోతున్న రైతులు
- ఇసుక మేటల తొలగింపు చర్యలు చేపట్టని ఎన్టీపీసీ, ఫార్మా సంస్థలు

ముత్యాలమ్మపాలెం తీరం వెంబడి ఉన్న ఉప్పునీటి కాలువ(ఉప్పుటేరు) రైతుల పాలిట శాపంగా మారింది. తరచూ ఇసుక మేటల కారణంగా పరిశ్రమల వ్యర్థ జలాలు సముద్రంలో చేరకుండా ఉప్పుటేరు నిలువరిస్తోంది. దీంతో ఈ వ్యర్థ జలాలు పంట భూముల్లో చేరి, ఆ భూములు నిస్సారంగా మారిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థ జలాలను యథేచ్ఛగా బయటకు వదులుతున్న ఎన్టీపీసీ, ఫార్మా పరిశ్రమలు ఉప్పుటేరులోని ఇసుక మేటల తొలగింపు పట్ల కనీస చర్యలు తీసుకోవట్లేదని ఆక్షేపిస్తున్నారు.



పరిశ్రమల వ్యర్థ జలాలతో నిండిన ఉప్పు గల్లీ భూములు



పరిశ్రమల వ్యర్థ జలాలతో నిండిన ఉప్పునీటి కాలువ

పరవాడ: మండలంలని ముత్యాలమ్మపాలెం తీరం దరి ఉప్పుటేరులో తరచూ ఇసుక మేటలు వేస్తోంది. ఫలితంగా ఉప్పు నీటి కాలువలో చేరిన ఎన్టీపీసీ, పలు ఫార్మా పరిశ్రమల వ్యర్థ రసాయన జలాలు సముద్రంలో కలిసే వీల్లేకుండా పోయింది. ఈ వ్యర్థాలతో ఉప్పుటేరు నిండిపోయి, సమీపంలోని పంట భూముల్లోకి చొచ్చుకుపోయి ఆ నీరు నిలిచిపోతోంది. దీంతో సరుగుడు, జీడి పంటలు నాశనమవుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఉప్పు పంటకు తీరని నష్టం

ప్రస్తుతం వర్షాకాలం అయినప్పటికీ మండలంలో కాస్తున్న ఎండలు ఉప్పు పంటకు అనుకూలమని రైతులు ఆనందిస్తున్న తరుణంలో ఉప్పుటేరులో **నిలిచిన వ్యర్థ రసాయన జలాలు ఉప్పు పంట మడుల్లోకి చొచ్చుకొస్తున్నాయి. ఉప్పు పంట తీవ్రంగా దెబ్బతిని, నష్టపోతున్నామని దలాయిపాలెం, వాడచీపురుపల్లి, గౌరుసువానిపాలెం గ్రామాలకు చెందిన ఉప్పు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.** ఉప్పుటేరును ఆనుకుని దలాయిపాలెంలో సుమారు 200 ఎకరాల్లో రైతులు ఉప్పు పంటను, మరో 160 ఎకరాల్లో సరుగుడు, జీడి పంటలు సాగు చేస్తున్నారు. ఉప్పుటేరులో చేరిన వ్యర్థ జలాలతో పంటలకు భారీ నష్టం వాటిల్లినట్లు పేర్కొంటున్నారు.

ఇసుక మేటలు.. పట్టించుకోని ఎన్టీపీసీ

ఉప్పు టేరుకు అడ్డంగా వేసిన ఇసుక మేటలు సముద్రంలో ఆటుపోట్లు ఏర్పడినపుడు, అధిక వర్షాల సమయంలో తొలగిపోతుంటాయి. ఈ మధ్యకాలంలో పెద్దగా వర్షాలు కురవని కారణంగా ఇసుక మేటలు తొలగిపోలేదు. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి పరిశ్రమలు విడుదల చేసిన వ్యర్థ జలాలు చేరడంతో ఉప్పుటేరు నిండు కుండలా మారి, రైతులను భయపెడుతోంది. ఇక్కడి ఇసుక మేటల్ని సింహాద్రి ఎన్టీపీసీ ఎప్పటికప్పుడు తొలగించేది. ప్రస్తుతం ఎలాంటి చర్యలూ చేపట్టట్లేదు. దీంతో సమీప ప్రాంత రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.



వ్యర్థ జలాలతో నిండిన పంట భూములు



ఉప్పు నీటి కాలువకు అడ్డంగా వేసిన ఇసుక మేటలు

బురద చేరి మరింత నష్టం

ఇటీవల కురిసిన వర్షాలకు నాటిన సరుగుడు మొక్కలు ఉప్పుటేరు నీరు చేరడంతో చనిపోతున్నాయి. ఫలితంగా పంట దిగుబడి మాట దేవుడెరుక.. రూ.వేలల్లో పెట్టిన పెట్టుబడి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని ఉప్పు పంట భూముల్లో వ్యర్థ జలాలతోపాటు బురద చేరడంతో దాన్ని తొలగించేందుకు మరింత వెచ్చించాల్సి వస్తుందని భయపడుతున్నారు. ఉప్పుటేరులో ఇసుకమేటలతోపాటు, వ్యర్థ జలాల తొలగింపునకు ఎన్టీపీసీ చర్యలు చేపట్టకపోతే ఆందోళన చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

సరుగుడు మొక్కలు చనిపోతున్నాయి



ఇటీవల కురిసిన వర్షాలకు ఉప్పుటేరు సమీపంలోని ఐదెకరాల భూమిలో సరుగుడు మొక్కలు నాటాను. మొక్కలు బతికాయన్న సమయంలో ఉప్పుటేరులో చేరిన వ్యర్థ జలాలు పంట భూమిలోకి చొచ్చుకుని నిలిచిపోయాయి. దీంతో సరుగుడు మొక్కలన్నీ చనిపోయాయి. భారీగా నష్టపోయాను.

– కూండ్రపు సతీరామయ్య, మంగప్పయ్యగారి గ్రామం

ఎన్టీపీసీ చోద్యం చూస్తోంది



ఎన్టీపీసీ యజమాన్యం విడుదల చేస్తున్న వ్యర్థ జలాలతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఉప్పుటేరు పక్కన భూముల్లో వేసిన సరుగుడు, జీడి పంటల భూముల్లో ఈ వ్యర్థ జలాలు నిలిచిపోవడంతో పంట భూములన్నీ ఇవకెత్తి మొక్కలు చనిపోతున్నాయి. ఏటా ఇదే పరిస్థితి ఎదురవుతోంది.

– కె.మహాలక్ష్మినాయుడు, సిమ్మన్నగారి గ్రామం

ఉప్పు పంట పొలాలు నాశనం



ఉప్పుటేరులో చేరిన ఎన్టీపీసీ వ్యర్థ జలాలతో ఉప్పు పండించే భూములు నిండిపోయాయి. ఉప్పు పంటకు తీవ్ర నష్టం జరుగుతోంది. ప్రస్తుత సీజన్‌లో ఎండలు మండుతున్న కారణంగా ఉప్పు పంటకు కొంత ఆస్కారం ఉన్నప్పటికీ ఉప్పుటేరు నీరంతా ఉప్పు పంట భూముల్లో రావడంతోపాటు, బురద చేరుతోంది.

– బూన రాంబాబు, గౌరుసువానిపాలెం

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

విశేషంగా గరుడసేవ: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవను ఆలయ బేడా మండపంలో ఉదయం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ జరిపి, విశేష హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

అనుమానాస్పద వ్యక్తులతో అప్రమత్తంగా ఉండండి

పెందుర్తి: 'మీ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న, నివాసం ఉంటున్న వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి. మంచిగా ప్రవర్తించి ముంచేసే వ్యక్తులు మీ చుట్టుపక్కలే చేరొచ్చు. వారితో జాగ్రత్తగా ఉండాలి' అని సీఐ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. జీవీఎంసీ 97వ వార్డు కార్మికనగర్‌వాసులకు నేరాలు–చోరీలు–ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆన్‌లైన్ కార్యకలాలపై ప్రజలు తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వడం పూర్తిగా తగ్గించాలని సూచించారు. నేరాల నియంత్రణలో ప్రజల బాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని కోరారు. కాలనీ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గెడ్డవాగు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

సబ్బవరం: మండలంలోని మొగలిపురం రెవెన్యూ పరిధి నేరెళ్ల చెరువు గెడ్డవాగు ఆక్రమణలపై గ్రామస్తులు, ఆయకట్టు రైతుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం క్షేత్ర పరిశీలన జరిపారు. గ్రామంలోని నేరెళ్ల చెరువు ఆయకట్టు రైతులు, గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు రంగంలోకి దిగారు. మొగలిపురం రెవెన్యూ పరిధి సర్వే నెం.74–4లో 48.82 ఎకరాల్లో నేరెళ్ల చెరువు విస్తరించి ఉంది. ఈ చెరువు కింద సుమారు 400 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే చెరువుపైన రియల్టర్లు ఎలాంటి అనుమతుల్లేకుండా కొంత మంది రాజకీయ నాయకుల అండతో లేఅవుట్లు వేసుకుని చెరువులోకి నీరు వచ్చే గెడ్డ వాగులను కబ్జా చేస్తున్నారు. ఈ చెరువుకు నీరు వచ్చే సర్వే నెం.57లోని గెడ్డ వాగును గతంలోనే అధిక శాతం ఆక్రమించగా, తాజాగా సర్వే నెం.10, 66, 67లోని గెడ్డ వాగునూ కబ్జా చేసినట్లు ఫిర్యాదులో గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో చెరువులోకి వచ్చే నీటి వనరులు దెబ్బతిని, ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేకుండా పోయిందని చెప్పారు. దీనిపై స్థానిక తహసీల్దార్‌తో పాటు జిల్లా కలెక్టర్‌కు అనేక పర్యాయాలు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేసినా న్యాయం జరగలేదన్నారు. దీనిపై సోమవారం మరోసారి ఆయకట్టు రైతులంతా పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో ఆర్డీవో క్షేత్ర స్థాయి పరిశీలన చేసి న్యాయం చేస్తారని కలెక్టర్ హామీ మేరకు తహసీల్దార్ చిన్నికృష్ణ, ఆర్ఐ వీరయ్య, రెవెన్యూ సిబ్బంది క్షేత్ర పరిశీలన జరిపారు. దీంతో అక్కడకు చేరుకున్న రైతులు గెడ్డవాగు ఆక్రమణలను తొలగించి చెరువుకు నీరు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. అయితే రెవెన్యూ అధికారులు తూతూ మంత్రంగా పరిశీలన చేసి, వెనుదిరిగారని రైతులు ఆరోపించారు.



క్షేత్ర పరిశీలన చేస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణకు గెడ్డవాగులను చూపిస్తున్న ఆయకట్టు రైతులు

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

పరవాడ: గత సర్వసభ్య సమావేశంలో ఒక్కో ఎంపీటీసీ సభ్యుడి పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ.10 లక్షల విలువైన పనులకు ఆమోదం తెలిపి, ప్రతిపాదనలు పంపగా ఇప్పటి వరకు వాటికి అధికారులు ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. పరవాడ కేంద్రంగా పట్టుబడిన కల్తీ మద్యంపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని సబ్బవరం ఎక్సైజ్ అధికారులను ఎంపీపీతో పాటు సభ్యులు నిలదీశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని సబ్బవరం ఎక్సైజ్ ఎస్ఐ రమణ వివరణ ఇచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గత సమావేశంలో ఆమోదం తెల్పిన పనులకు త్వరితగతిన ప్రొసీడింగ్స్‌ను అందించి, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. అభివృద్ధిలో జిల్లాలో పరవాడ మండలం ప్రథమ స్థానంలో నిలిచేలా చూడాలన్నారు. ప్రస్తుతం మండలంలో అమలవుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా సమావేశంలో సభ్యులు సూచించిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. నాయుడుపాలెం, స్వయంభూవరం, రావాడ గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కోరారు. తహసీల్దారు నాగరాజు హామీ ఇచ్చారు. పెదముషిడివాడ, పరవాడ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలు, అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. తాడి గ్రామ తరలింపు కోసం జరిగిన సర్వేలో 1,156 మంది నిర్వాసితులుగా తేలారని, గ్రామ తరలింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తహసీల్దార్ చెప్పారు. అంతకు ముందు వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీపీ రివ్యూ జరిపారు. సమావేశంలో ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు, వైస్ ఎంపీపీలు బి.అప్పలరాజు, నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, మండల అధికారులు

విద్యుత్ సర్దుబాటు చార్జీలపై నిరసన



పరవాడలో ఆందోళన చేస్తున్న ఐద్వా సభ్యులు

పరవాడ: కరెంటు సర్దుబాటు చార్జీల భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపడం సరికాదని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం ఆక్షేపించారు. సర్దుబాటు చార్జీలను నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో పరవాడలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాణిక్యం మాట్లాడుతూ అధిక బిల్లులు వస్తున్న స్మార్ట్ మీటర్లను అమర్చడం మానుకోవాలని కూటమి ప్రభుత్వానికి హితవుపలికారు. వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని పగులగొట్టాలని వినియోగదారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు మన్యాల బంగారమ్మ, తుంపాల అన్నపూర్ణ, గోపాలరావు, లక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా 'అయితే' ప్రమాణం

పెందుర్తి: పెందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) చైర్మన్‌గా అయిత సింహాచలం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక తాండ్రపాపారాయుడు కల్యాణ మండపంలో మంగళవారం అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సమక్షంలో డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు సింహాచలంతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ నూతన కార్యవర్గం రైతులకు మెరుగైన సేవలు అందించి, వారి మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ సింహాచలంతో పాటు సభ్యులు చిరికి అవతారం, ఉగ్గిన అచ్చిబాబు బాధ్యతలు చేపట్టారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు, పీఏసీఎస్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ చైర్మన్‌గా సింహాచలంతో ప్రమాణం చేయిస్తున్న డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, చిత్రంలో ఎమ్మెల్యే పంచకర్ల

1న మెగా రక్తదాన శిబిరం

పెదగంట్యాడ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మా మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెదకోరాడ జంక్షన్‌లో ఆగస్ట్ 1న నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పెదకోరాడ జంక్షన్‌లో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. పెద్ద సంఖ్యలో యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ భూమేనా.. అయితే మాదే..!

- జీవీఎంసీ 88వ వార్డులో కూటమి నాయకుల దురాక్రమణపర్వం
- నరవలో రూ.15 కోట్ల ప్రభుత్వ భూమికి ఎసరు
- సర్వే నెం.36లో 1.77 ఎకరాల భూమి కబ్జాకు చర్యలు

పెందుర్తి: పెందుర్తి రెవెన్యూలో ఉన్నతాధికారుల గైర్హాజరీతో ప్రభుత్వ భూములను కూటమి నాయకులు పప్పుబెల్లాల్లా పంచుకుంటున్నారు. కిందిస్థాయి సిబ్బందిని మచ్చిక చేసుకుని దర్జాగా కబ్జాకాండను కొనసాగిస్తున్నారు. రూ.కోట్లు విలువైన ప్రభుత్వ భూములు, బంజరు, గెడ్డలను సైతం అడ్డగోలుగా సొంతం చేసుకుంటున్నారు.

నరవలో ఇష్టారాజ్యం

ముఖ్యంగా జీవీఎంసీ 88వ వార్డు నరవ రెవెన్యూలో పరిధిలో కూటమి నాయకుల కనుసన్నల్లో కబ్జా కాండ నిరాటంకంగా జరుగుతోంది. ఇక్కడ రెవెన్యూ అధికారులు కనీసం అడ్డుకునే స్థితిలో కూడా లేకపోవడంతో గ్రామంలోని ప్రభుత్వభూములు టీడీపీ నేతల స్వాధీనంలోకి వెళ్లిపోయాయి. ఎంతలా అంటే గ్రామానికి అతి సమీపంలోని సర్వే నెం.36లో 1.77 ఎకరాల గెడ్డవాగులో పాగా వేసేంత. దాదాపు రూ.15 కోట్లు విలువ చేసే ఈ భూమిని ముక్కలుగా పంచుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. ఇక్కడ ఇంత జరుగుతున్నా ఏ స్థాయి రెవెన్యూ అధికారీ కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

ప్రభుత్వ భూములే లక్ష్యంగా..

ఇప్పటికే నరవ రెవెన్యూ పరిధి అక్రమ మైనింగ్‌కు చిరునామాగా నిలిచింది. శివారులోని ప్రభుత్వ భూమితో పాటు ఏపీఐఐసీకి చెందిన భూముల్లో సైతం కూటమి నాయకులు అనుమతుల్లేకుండా రేయింబవళ్లు గ్రావెల్ తవ్వకాలు జరిపి రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. తాజాగా వారంతా ప్రభుత్వభూములపై దృష్టి సారించారు. ఎక్కడికక్కడ బంజరు, గెడ్డలు, వాగులను క్షుణ్ణంగా పరిశీలించి ఆక్రమిస్తున్నారు. ఈ క్రమంలోనే రూ.15 కోట్లు విలువ చేసే సర్వే నెం.36లోని స్థలంలో పాగా వేశారు. మొత్తం భూమిని తమ ఆధీనంలోకి తెచ్చుకుని యథేచ్ఛగా అమ్మకాలు జరిపి, నిర్మాణాలు కూడా వారే చేపడుతున్నారు. మరోవైపు రెవెన్యూ ఉన్నతాధికారులు సైతం లేకపోవడంతో నరవలో ఇటు భూ ఆక్రమణలు అటు ప్రభుత్వ భూముల కబ్జాలు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి నరవలో జరుగుతున్న ప్రభుత్వ భూముల దురాక్రమణలు అడ్డుకోవాలని కోరుతున్నారు.



నరవ సర్వే నెం.36లో ఆక్రమణకు గురవుతున్న గెడ్డవాగు ప్రాంతం



నరవ సర్వే నెంబర్ 35లో అక్రమ నిర్మాణం



ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ మీ భూమిలో సర్వే నెం.36 గెడ్డవాగు అని చూపుతున్న దృశ్యం



కూటమి నాయకుల చెరలో ఉన్న రూ.15 కోట్లు విలువైన భూమి

పరిశీలించి చర్యలు

నరవలో సర్వే నెం.36లో ఆక్రమణలు మా దృష్టికి రాలేదు. దీనిపై పరిశీలన చేసి కబ్జా నిజం అయితే తక్షణమే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూముల ఆక్రమణలు సహించం.

– ఎ.సంతోష్‌కిరణ్, ఇన్‌చార్జి తహసీల్దార్, పెందుర్తి